నేడు ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిల్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సమ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. పార్వతీపురంలో ఐటిడిఎ ప్రాంగణంలో ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తుండగా, సీతంపేటలో గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజనులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

ఆసుపత్రుల్లో రేడియాలజిస్టుల కొరత

స్కానింగ్ సేవలు అందక పేద రోగులకు ఇబ్బంది
సొమ్ము చేసుకుంటున్న ప్రయివేటు స్కానింగ్ సెంటర్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్రధానమైన ప్రభుత్వ ఆసుపత్రుల్లో రేడియాలజిస్టుల కొరత వెంటాడుతూనే ఉంది. స్కానింగ్ సేవలు అందుబాటులో ఉన్నా రేడియాలజీ డాక్టర్లు లేక నిరుపేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రయివేటు డయాగ్నిస్టిక్ సెంటర్లకు వెళ్లి చేతి చమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కడుపు, ఇతర విభాగాలకు సంబంధించిన శస్త్ర చికిత్సలకు ముందు వైద్యులు స్కానింగ్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఆ మేరకు ఉచితంగా స్కానింగ్ సేవలు పొందడానికి జిల్లా కేంద్రాసుపత్రిలో గానీ, సాలూరు ఏరియా ఆసుపత్రిలో గానీ వైద్యుల్లేని పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల్లో రేడియాలజిస్టుల కొరత ఉంది. ప్రధానంగా మన్యం జిల్లాలో గల ఆసుపత్రుల్లో పని చేయడానికి రేడియాలజీ డాక్టర్లు ముందుకు రావడం లేదు. పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గత నెల రోజులుగా రేడియాలజీ డాక్టర్ లేరు. ఇక్కడ పని చేసిన రేడియాజిస్టు డాక్టర్ జయరాంను సాలూరు ఏరియా ఆసుపత్రికి బదిలీ చేశారు. ఆయన సాలూరు ఏరియా ఆసుపత్రిలో చేరి ఒకరోజు మాత్రమే విధులు నిర్వహించి దీర్ఘకాలిక సెలవు పెట్టారు. ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేశారు. గతంలో మూడేళ్ల క్రితం కూడా పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న రేడియాలజిస్టు డాక్టర్ విజయ కిశోర్‌ను సాలూరు ఏరియా ఆసుపత్రికి బదిలీ చేయడంతో ఆయన కూడా ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఫలితంగా ప్రభుత్వాసుపత్రుల్లో నిరుపేద రోగులకు స్కానింగ్ సేవలందడం లేదు. ప్రధానంగా గర్భిణులు ప్రసవమయ్యేంత వరకు తరచూ స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. గర్భంలో బిడ్డ కదలికలు, ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడానికి వైద్యులు ఎక్కువగా స్కానింగ్ పరీక్షకు సిఫార్సు చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు అందకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో పేద రోగులు, గర్భిణులు ప్రయివేటు డయాగ్నోస్టిక్ సెంటర్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకసారి స్కానింగ్ పరీక్ష చేసుకుంటే రోగికి వెయ్యి రూపాయల నుంచి 1500 రూపాయల వరకు ఖర్చు అవుతోంది. తొమ్మిది నెలల కాలంలో పేద గర్భిణులు ఎక్కువ సార్లు స్కానింగ్ చేయించుకోవాల్సిన అవసరం ఉంది. దీని వల్ల ఒక్కో గర్భిణిపై సగటున పదివేల రూపాయల వరకు ఆర్థిక భారం పడుతోంది. స్కానింగ్ సౌకర్యాలు కల్పించినా ప్రభుత్వం వైద్యులను అందించలేని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో నిరుపేద రోగులకు ఆర్థిక కష్టాలు తప్పడం లేదు. పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి రోజూ 700 మంది అవుట్ పేషెంట్లు వైద్యం కోసం వస్తున్నారు. వీరిలో స్కానింగ్ అవసరం ఉన్నా రోగులు కనీసం 50మంది నుంచి 100 వరకు ఉంటారు. సాలూరు ఏరియా ఆసుపత్రిలో రోజువారీ రోగుల తాకిడి పెరిగింది. అవుట్ పేషెంట్ల సంఖ్య రోజుకు 400 వరకు ఉంటోంది. ఈ రెండు ఆసుపత్రులకు ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చే రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు పెద్దాసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు ఉన్నా, వైద్యులు అందుబాటులో ఉన్నా స్కానింగ్ సేవలు అందకపోవడంతో ఏజెన్సీ ప్రాంత పేద రోగులు చేతి చమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



రేడియాలిస్టు లేకపోవడంతో జిల్లా ఆసుపత్రిలో మూతపడ్డ స్కానింగ్ గది

ప్రయివేటు సెంటర్లకే రేడియాలజిస్టుల మొగ్గు

ప్రభుత్వాసుపత్రుల్లో రేడియాలజిస్టులు పని చేయడానికి ఆసక్తి చూపకపోవడం వెనుక ప్రధాన కారణం వారికి తక్కువ వేతనాలు ఇవ్వడమేనని తెలుస్తోంది. రేడియాలజీ డాక్టర్లను లను కాంట్రాక్టు పద్ధతిలో ప్రభుత్వం భర్తీ చేస్తూ నిర్ణీత వేతనం మంజూరు చేస్తోంది. తక్కువ జీతం ఇచ్చి ఎక్కువ సమయం పని చేయాల్సిన పరిస్థితి రావడంతో వారు ప్రభుత్వ ఉద్యోగాలు చేయడానికి ముందుకు రావడం లేదని స్పష్టమవుతోంది. ప్రయివేటు డయాగ్నోస్టిక్ సెంటర్లు సొంతంగా పెట్టుకుని రోజూ వేలాది రూపాయలు సంపాదించే పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాసుపత్రుల్లో పని చేయడానికి రేడియాలజీ డాక్టర్లు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం రేడియాలజీ డాక్టర్లకు తగిన జీతభత్యాలు కల్పించి స్కానింగ్ సేవలు అందేలా చూడాలని పేద రోగులు కోరుతున్నారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న సిఐటియు నాయకులు

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండలో సెప్టెంబర్ 13 ,14 తేదీల్లో సిఐటియు పార్వతీపురం మన్యం జిల్లా 11వ మహాసభలు జరగనున్నాయని, వీటిని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు, కార్యదర్శి బివి రమణ పిలుపునిచ్చారు. ఈ మహాసభలు సందర్భంగా 13న ర్యాలీ, బహిరంగ సభ జరగనుందని తెలిపారు. అలాగే డిసెంబర్ 31, జనవరి 1- 4 తేదీల్లో విశాఖలో జరుగు సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. శుక్రవారం పాలకొండ నవోదయనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో కార్మిక వర్గం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటుందని, ఈ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్పొరేట్లకు మేలు చేసేందుకు కార్మిక వర్గం హక్కులను హరించేందుకు పని గంటలు పెంచేందుకు ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్ర భాగాన నిలిచిందని తెలిపారు. దేశంలో వివిధ రంగాల కార్మిక సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు సిఐటియు అఖిల భారత మహాసభలు దోహదపడతాయని తెలిపారు. ఈ మహాసభ లకు ముందు రాష్ట్ర, జిల్లా మహాసభలు నిర్వహించినున్నా మన్నారు. అందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా మహాసభలు సెప్టెంబరు 13,14 తేదీల్లో పాలకొండలో జరుగుతాయన్నారు. ఈ మహాసభలను పాలకొండ ప్రాంత కార్మిక వర్గం, వర్తక, వాణిజ్య, రాజకీయ ప్రముఖులు సహకరించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కాద రాము, అర్థముడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

మక్కువ : మండల విఆర్‌ఎల మహాసభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా జి.పవన్ కల్యాణ్, ఉపాధ్యక్షులుగా డి.సింహచలం, కార్యదర్శగా కె.సింహాచలం, కోశాధికారిగా బి.పార్వతి, ఎ.హైమావతి, కమిటీ సభ్యులుగా ముకుంద సూరమ్మ, భాస్కరరావు ఎన్నియ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విఆర్‌ఎల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న పాపంపేట ప్రాథమిక పాఠశాల

శిథిలావవస్థలో భవనాలు

భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - వీరఘట్టం

పదికాలాలు ఉండాల్సిన భవనాలు పట్టుమని ఐదేళ్లు దాటకముందే శిథిలా వవస్థకు చేరుకున్నాయి. దీన్ని బట్టి చూస్తే పనుల్లో న్యాణ్యతా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో వీటిని చూస్తే అర్థం చేసుకోవచ్చు. మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయంతో పాటు తూడి పశు వైద్య కేంద్రం, పెద్దూరు, సందిమానుగూడ గిరిజన పాఠశాలలు, పాపంపేట, బొడ్లపాడు అంగన్వాడి కేంద్రాలు శిథిలావస్థకు చేరుకోవడంతో విధులు నిర్వహించేందుకు ఉద్యోగులు, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్నారు. శ్లాబ్‌పైన పెచ్చులూడడంతో అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు నీరు పై నుంచి కిందకు జారడంతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుత్తేదారులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి పనులు జరిగినప్పుడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత ప్రమాణంతో నిర్మించకపోవడంతో ఎక్కడికక్కడ శ్లాబ్, గోడలు పెచ్చులూడి దర్శనమిస్తున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అద్దె భవనంలో విధులు

మండలంలోని పాపంపేట ప్రాథమిక పాఠశాల, నడుకూరు, గ్రామపంచాయతీ, చిట్టిపూడి వలస, విక్రంపురం, రేగులపాడు, కంబరవలస, తదితర గ్రామాల భవనాలు పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరుకోవడంతో ఎటువంటి ప్రమాదం జరగకముందే అద్దె భవనాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. వేసవి సెలవుల్లో పాపంపేట పాఠశాల వెనుక గోడ కుప్పకూలిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పడంతో అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన ఉన్న భవనంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సెక్టార్ మీటింగు నిర్వహించుకొనేవారు. ఇప్పుడు అది కూడా పూర్తిగా శిథిలా వ్యవస్థకు చేరుకోవడంతో పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు చేపట్టినప్పుడు పర్యవేక్షించి, ప్రజా ధనాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆదివాసీల జీవనోపాధికి కృషి చేద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని గిరిజన ప్రజలకు విద్య, వైద్యం, జీవనోపాధులను కల్పించేందుకు అందరం కలిసి కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఐటిడిఎలోని అడవితల్లి విగ్రహానికి ప్రథమ పూజలు గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సంప్రదాయబద్ధంగా జరిగాయి.

ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవను గిరిజన సంప్రదాయం దుస్తులతో ఊరేగింగపుగా అడవి తల్లి విగ్రహం వరకు తీసుకొచ్చారు. అడవితల్లికి సారెను అందించగా, అధికారులు, గిరిజన సంఘాల నాయకులతో కలిసి పాలాభిషేకాన్ని నిర్వహించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం అడవితల్లి చుట్టూ ప్రదర్శనలు నిర్వహించి, సంప్రదాయబద్ధంగా డప్పులను పిఒతో కలిసి వాయించారు. కలెక్టర్, పిఒ గిరిజనులతో, కలిసి సంప్రదాయం నృత్యం చేసి ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కల్మషం లేని అమాయక గిరిజనులు మధ్యలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గిరిజనులకు నాణ్యమైన విద్య, వైద్యంతో పాటు వారికి జీవనోపాధులు కల్పించి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాల్సి ఉందని, ఇందుకు సమష్టి కృషి అవసరమన్నారు. గిరిజనుల సంక్షేమానికి ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలుచేస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఐటిడిఎ, జిల్లా యంత్రాంగం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం విలు విద్య పోటీలను ప్రారంభించి, విలువిద్యను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి ఆర్.కృష్ణవేణి, డిఐఒ డాక్టర్ పి.జగన్మోహనరావు, గిరిజన సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, పల్ల సురేష్, ఆరిక చంద్ర శేఖర్, ఇంటికొప్పల రామకష్ణ, బిడ్డీక తమ్మయ్య,దుక్క సీతారాం, మంచాల పారమ్మ, కోలక గౌరమ్మ, బొత్తాడ గౌరీ శంకర్ రావు, రొబ్బ లోవరాజు, ఆరిక విప్లవ కుమార్, గేదెల రామకష్ణ, మండల గిరిధర్, తాడంగి సాయిబాబు, ఊర్లక నాగార్జున, ధోని సురేష్, జట్ల బంగార్రాజు, చెల్లూరి సీతారాం, మజ్జి నారాయణ, జలుమూరి మని కుమార్,ఉడతల సత్యం, ఆడారి వెంకటరమణ, పాలవలస భగవాన్ తదితరులు పాల్గొన్నారు.


అడవి తల్లికి సారె తీసుకొస్తున్న ఐటిడిఎ పిఒ అశుతోష్‌శ్రీవాస్తవ

ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లు పూర్తి

ప్రపంచ ఆదివాసి దినోత్సవ ఏర్పాట్లు పూర్తయ్యాయని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మరియు పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఐటిడిఎలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమం శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని, అయితే ఎక్కడ లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు, డ్వాక్రా సంఘాల ఉత్పాదకాలు తదితర అంశాలతో ప్రదర్శనశాలను ఏర్పాటు చేస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, సహాయ గణాంక అధికారి ప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఆర్ కష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటడిఎ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో శనివారం పిఒయశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే సీతంపేట గ్రీన్ ఫీల్డ్ స్టేడియం అన్ని హంగులతో ముస్తాబైంది. అదేవిధంగా ఐటిడిఎ ముఖ ద్వారం వద్దనున్న అడవితల్లి విగ్రహానికి ఇప్పటికే రంగులతో సిద్ధం చేశారు. ఈ నియోజకవర్గంలో వస్తున్న గిరిజన అందరికీ అన్ని సౌకర్యాలు భోజనాలు ఏర్పాట్లు చేశారు . అయితే ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆదివారం కొనసాగుతుంది. ఇప్పటికే డిడి ఎం.అన్నదొర ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ ఏర్పాట్లలో సూపరింటెండెంట్ ఎల్.అప్పారావు. స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్, సిబ్బంది కె.కాంతారావు బి సత్య రావు తదితరులు పాల్గొన్నారు.


అడవి తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, పిఒ

విలువిద్య పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్‌శ్యామ్ ప్రసాద్

వైసిపి నాయకులపై దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టినప్పటి నుంచి నేటి వరకూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైసిపి నాయకులను, స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇది హేయమైన చర్యని జిల్లా బిసి సెల్ అధ్యక్షులు, జెడ్‌పిటిసి వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. ఇటీవల కడప జిల్లా పులివెందులలో వైసీపీ ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై టిడిపి గుండాలు చేసిన దాడికి నిరసనగా బెలగాంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి వినతిపత్రం అందజేసి బిసి నాయకులపై టిడిపి దాడులు నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బాపూజీ నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం పాలనలో రెడ్‌బుక్ పాలనతో తీవ్ర హింసను ప్రేరేపిస్తూ ప్రతిపక్షాన్ని అణగదొక్కాలన్న దురాలోచనతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పులివెందులలో జరుగుతున్న జడ్పీటీసీ ఉపఎన్నికలో ఎలాగైనా గెలుపొందాలనే దురుద్దేశంతో ఎన్నికల ప్రచారంలో ఉన్న వైసిపి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై జరిగిన దాడి కూటమి ప్రభుత్వం బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తుందని ఆయన అన్నారు.


జ్యోతిరావు పూలే విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేస్తున్న వైసిపి నాయకులు

కూటమి ప్రభుత్వానికి గెలిచే దమ్ము ధైర్యం ఉంటే ప్రజాస్వామ్యంలో తేల్చుకోవాలి కానీ ఇలాంటి దాడులకు పాల్పడడం సరికాదన్నారు. ఈ దాడులకు భయపడి వైసిపి నాయకులు ఎవరూ వెనక్కి తగ్గే ప్రసక్తే ఉండదని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం శాంతిభద్రతలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షులు గొర్లి మాధవరావు, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు సర్వీశెట్టి శ్రీనివాసరావు, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మర్రాపు శ్రీనివాస్, యూత్ వింగ్ అధ్యక్షులు నంగిరెడ్డి శరత్ బాబు, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షులు లొలుగు నారాయణరావు, జిల్లా ఐటీ అధ్యక్షులు పూడి కృష్ణచైతన్య, చేనేత విభాగం అధ్యక్షులు ఆశపు సర్వేశ్వరరావు, మున్సిపల్ జిల్లా అధ్యక్షులు పాత గౌరీశంకరరావు, పార్వతీపురం మండల వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, జడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంగర తహాశీల్దార్ సస్పెన్షన్

- ఇన్‌ఛార్జిగా రాజాం తహాశీల్దార్‌కు అదనపు బాధ్యతలు
- విచారణ అధికారిగా కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసి మురళి

ప్రజాశక్తి-వంగర, విజయనగరం

వంగర ఇన్చార్జి తాహాశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహాశీల్దార్ హెచ్. రమణారావును జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రమణారావు విధి నిర్వహణలో ఉండగా, కార్యాలయంలోనే మద్యం సేవించి, నేలపై నిద్రపోయినట్లు వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ ఈ ఆదేశాలను జారీ చేశారు. వంగర మండలానికి ఇన్చార్జి తాహాశీల్దారుగా, రాజాం తాహాశీల్దార్ రాజశేఖర్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ వ్యవహారంపై విచారణాధికారిగా కెఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా రమణారావుపై గతంలోనూ పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. సక్రమంగా విధులు నిర్వహించకుండా వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వారినుంచి దండిగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో సివిల్ సప్లయి విభాగంలో పనిచేసినప్పుడు కూడా ఆయనపై అధికారులు చర్యలు చేపట్టారు.

సిఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వన్ టు వన్‌లో భాగంగా సిఎం నారా చంద్రబాబును ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని, పిఎంజన్మ యోజన పథకం కింద పివిటిజి గ్రామాలకు బోర్లు, శ్రీనిధి కింద మహిళా మండలి గ్రూపులకు రుణాలివ్వాలని, నియోజకవర్గంలో గల పెండింగ్‌లో ఉన్న నాడు నేడు పనులకు నిధులు మంజూరు చేయాలని, భద్రగిరి వంద పడకల ఆస్పత్రిని అభివృద్ధి చేసేందుకు నిధులు ఇవ్వాలని, కుంకీ ఏనుగులు కురుపాం నియోజకవర్గం నుంచి పంపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఏనుగుల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, వసతి గృహాలకు ఆరోగ్య కార్యకర్తలు, ఆసుపత్రులకు స్టాఫ్‌నర్సులను నియమించాలని, పూర్ణపాడు లాబేసు వంతెన త్వరగా పూర్తి చేయాలని, జిఒ 3కు బదులు కొత్త జిఒ తెచ్చి గిరిజనులకు ఆదుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. దీనికి సిఎం సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సిఎంకు బొకేను అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కొండ గూటికి పండగొచ్చింది

ప్రజాశక్తి - సీతంపేట

సాధారణంగా ప్రకృతితో మమేకమై జీవించే వారం దేవుడు అందరికీ ప్రసాదించిందని కానీ ఆ వరాన్ని ఇప్పటికీ ఆస్వాదిస్తున్నది మాత్రం ఆదివాసులే. అభివృద్ధి పేరిట సహజత్వానికి దూరమై తాత్కాలిక కాంతుల మధ్య బతుకులు బతుకుతున్న వారికి సనాతనంగా పర్యావరణంతో మమేకమై జీవిస్తున్న గిరిజనుల బతుకులు చాలా భిన్నంగా కనిపిస్తున్నాయి. అనాదిగా మారని కట్టూ బొట్టు ఆహార వ్యవహారాలు, ఆహార నియమాలు, పనీ పాట వీరికి అందరితో ప్రత్యేకంగా నిలుపుతాయి. తెల్లవారితే కొండపోడు వ్యవసాయం అటవీ ఉత్పత్తుల సేకరణతోనే వారి జీవనం సాగుతుంది. ప్రతి మూడు నెలలకు ఒక్కొక్క ఉత్పత్తి సీజన్లు ఆరంభం అవుతుంది. పైనాపిల్, సీతాఫలం, పసుపు, జీడి, కందులు, నిమ్మ ఉత్పత్తులతో వీరు జీవనం ముడిపడి ఉంటుంది. వారం వారం జరిగే వారపు సంతకు వెళ్లి వారి ఉత్పత్తులు విక్రయించి వారానికి సరిపడా సరుకులు కొనుగోలు చేసుకుంటారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 20 మండలాల్లో లక్ష అరవై మూడు వేలు గిరిజన కుటుంబాలు ఉన్నాయి. కొండ సవర, జాతాపు కాపు, సవర తెగలు ఉన్నాయి. వివాహాలు, పండగలు, వ్యవసాయం తదితర సందర్భాల్లో ప్రత్యేక పండుగలు నిర్వహించుకోవడం ఎంతో వైవిధ్యం. భార్యకు కట్నం ఇచ్చి వివాహం చేసుకొనే (మొగనాలి) సంప్రదాయం ఇప్పటికీ కొన్నిచోట్ల అమల్లో ఉంది.

అక్షరాలే ఆరాధ్య దైవాలు

జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల్లో మరో వైవిధ్యం ఉంది. ఇక్కడ అక్షరాలను ఆరాధ్య దేవతలుగా గిరిజనులు పూజిస్తారు. ఏ దేవతకైనా పూజలు చేసినా వైవిధ్యంగా నాటు సారా పెట్టి పూజ అనంతరం పూటుగా సారా సేవిస్తారు. జీలుగు సారా వంటివి చెట్టు నుంచి దించిన ముందుగా తెద్దలతో సేవిస్తారు. వారు పండుగలు సంప్రదాయాలను బొమ్మల రూపంలో చేయడంలో వీరికి వీరే సాటి. ఏజెన్సీలో అక్షర బ్రహ్మ మడి బ్రహ్మ వంటి ఆలయాలు వెలిశాయి. అక్కడ గిరిజనులు ప్రతి గురువారం పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఆగం పండుగ వంటివి చేస్తుంటారు. సవర లిపి ద్వారా కొంతమంది ఆదిమ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. వీరు వేసే లిపికి మైదాన ప్రాంతాల్లో నుంచి డిమాండ్ ఉంది.

ఆదివాసీ దినోత్సవం ఆవిర్భావం ఇలా...

ఆదివాసీల జీవితాలు స్థితిగతులను ప్రపంచానికి తెలియ జేసేందుకు ఐక్యరాజ్యసమితి 1994 ఆగస్టు 9న జెనీవాలో ప్రపంచ ఆదివాసీ వర్కింగ్ గ్రూప్ సమావేశాలు ఏర్పాటు చేసింది. ఈ వర్కింగ్ గ్రూప్ ఆదివాసీలపై అధ్యయనం చేసి ప్రపంచ దేశాల్లో ఆదివాసీల సమస్యలన్నీ దాదాపు ఒకేలా ఉన్నాయని గుర్తించింది. దీంతో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని యుఎన్ఒ ప్రకటించింది. అప్పటి నుంచి ఆదివాసీల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఆదివాసీలను కాపాడుకోవాలనిదే ఈ ఉత్సవం వెనుక ఉద్దేశం.

- ◆ అనాదిగా అడవిని కాపాడుకుంటున్న గిరిజనులు
- ◆ ప్రకృతి ఒడిలో మమేకమైన జీవనం
- ◆ ఏళ్ల తరబడి పరిష్కారం కానీ సమస్యలు
- ◆ నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

వసంతంలో కోయిలలు హృదయ గళంతో వారికి నిత్యం సుప్రభాతాలు వినిపిస్తాయి. శిశిరంలో రాలిన ఆకులు మనసారా వారికి పాదసేవ చేస్తాయి. శరత్ చంద్రుడు తనివి తీరా వెన్నెల కాంతులతో ఆ మనుషులను అభిషేకిస్తాడు. హేమంతం వారి కోసమే వచ్చి వెళ్లినట్టు మాటమాటికీ మంచుతెరలు పంపిస్తుంది. ఋతువులన్నీ కలిసి ఆదివాసీని ఆత్మీయంగా గౌరవించుకుంటాయి. అనాదిగా అడివిని కాపాడునేందుకు కాలానికి అనుగుణంగా ఉచిత రీతిలో సత్కరించుకుంటాయి. ఒకవైపు నాగరికత పేరుతో ఉన్మాదం వచ్చినట్లు చెట్లను కొట్టేస్తూ అడివి ఒడిని ధ్వంసం చేస్తుంటే ఆ శిథిల వనంలో ఉంటూ నిస్వార్థంగా వృక్షాలను కాపలా కాస్తున్న ధన్యజీవులు వీరు. నేడు ఆదివాసీ దినోత్సవం. సకాలంలో వానలు పడుతున్నాయన్నా, కల్తీ లేని వస్తువులతో కొన్నింటిని అయినా తినగలుగుతున్నాం. అడవి బిడ్డ కొండ మల్లెలంతా అందమైన మనసున్న అడవి బిడ్డలు గురించి..

సంప్రదాయ నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు (ఫైల్)

ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలు

సీతంపేట ఐటిడిఎ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటికీ రోడ్డు లేని గిరిజన తండాలు 100 వరకు ఉన్నాయి. గిరిజనులు ఆరుగాలం సేకరించిన అటవీ ఉత్పత్తులైన కొండ చీపుర్లు, పైనాపిల్ తదితర పంటలకు మార్కెట్ ధర లేక గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఏజెన్సీలో సాగునీటి జలాశయాలు లేవు. దీంతో ఇప్పటికీ వరుణి మీదే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఇప్పటికీ వర్షాధార సాగునిరంతర ఆగస్టు మొదటివారం వచ్చినా వరి నాట్లు వేయలేదు.

వీడని ఏనుగుల సమస్య

ఇక ఏజెన్సీని సుమారు 15 ఏళ్లుగా ఏనుగులు వెంటాడుతూనే ఉన్నాయి. ఇప్పటికే ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లింది. అయినా పట్టించుకోని నాథుడు కరువయ్యారు. చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది. ఏజెన్సీలో ఇప్పటికీ గూడంగి, దుంభంగివలస తదితర గిరిజన తండాలకు విద్యుత్తు సౌకర్యం లేక కారు చీకట్లోనే జీవనం సాగిస్తున్నారు. ఆదివాసీ మ్యూజియం పనులు నేటికీ పూర్తికాలేదు. ఆరేళ్ల క్రితం సీతంపేట పీఎంఆర్‌సి వద్ద గిరిజన మ్యూజియం అప్పటి పిఒ ఏర్పాటు చేశారు. అయితే 60 శాతం వరకే పనులు పూర్తి చేశారు. అనంతరం పనులు నిలిచిపోయాయి. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలనే ఉద్దేశంతో ఆదివాసీ మ్యూజియం ఏర్పాటు చేశారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ రకాల గిరిజనుల పనిముట్లు గిరిజన జీవన విధానం తదితరమైనవి కళ్ళకు కట్టేలా బొమ్మలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేశారు. అది ఇప్పటికీ పూర్తి కాలేదు.

మ్యూనిజంలో ఉన్న గిరిజనుల వాడిన పరికరాలు (ఫైల్)

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలో శనివారం జరగబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం. సన్యాసి, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎ.గంగారావు గ్రామాల్లో ప్రచారం చేశారు. గిరిజనుల ముఖ్యమైన ఆదివాసీ దినోత్సవం పండగ వాతావరణంలా జరుపుకోవాలని కోరారు. గిరిజన చట్టాలు, హక్కులు ఈ పండగ వేదిక కానున్నాయని తెలిపారు. మండలంలోని ఆమిటి, మోరమగూడ, కూరసింగి, కార్యవలస, లంబేసు, గౌడుగూడ గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో పలువురు గిరిజన యువత పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల కోసం పోరాడాలి

మక్కువ : ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ, భాషను పరిరక్షించుకొంటూ తమ హక్కుల కోసం పోరాడాలని గిరిజన సంఘం మండల నాయకులు తాడంగి ప్రభాకర అన్నారు. శుక్రవారం ఎ.వెంకం పేట పంచాయతీలోని లోతుగెడ్డ గిరిజన గ్రామంలో ఆదివాసీ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు సిహెచ్ కృష్ణ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సోండియా, దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కోట దుర్గమ్మను దర్శించుకున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో గల కోటదుర్గమ్మ వారిని సబ్ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనకు మర్యాదాపూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు దగ్గరుండి పూజలు నిర్వహించారు. అదేవిధంగా తూర్పు కాపుకార్పొరేషన్ డైరెక్టర్ గండి రామినాయుడు కోటదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంఘ సభ్యురాలికి చెక్కును అందజేస్తున్న ఒడిశా డిప్యూటీ సిఎం పార్వతీపరీడా

కొటియా గ్రామాల్లో ఒడిశా డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒడిశా డిప్యూటీ సీఎం పార్వతీ పరీడా, మంత్రులు శుక్రవారం పర్యటించారు. కొటియా, దేవుమలై గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఒడిశా విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గండ్, మత్స్య శాఖ మంత్రి గోకుల్ నందా మల్లిక్, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపుబోత్రా, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మాచీ, ఎంపి కాలీరాం మాజీ హాజరయ్యారు. నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పండిస్తున్న ప్రగతి మహిళా సంఘం సభ్యులకు రూ.5 లక్షలు, మరో మహిళా సంఘానికి రూ.5లక్షల చొప్పున చెక్కులను డిప్యూటీ సిఎం పరీడా, మంత్రులు అందజేశారు.

ఇన్‌ఛార్జి కమిషనర్‌గా డిఇ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌గా విధులు నిర్వహించిన సిహెచ్ వెంకటేశ్వర్లును ఈనెల 6న అమరావతిలో వెలగపూడి కార్యాలయంలో గల కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం నుంచి తప్పించినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఇన్చార్జి కమిషనర్‌గా డిఇగా శ్రీనివాసరాజును నియమిస్తున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వులు చేశారు. దీంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరాజుకు కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

నారా లోకేష్‌ను కలిసిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి - పాలకొండ

రాష్ట్ర విద్యాశాఖా మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను విజయవాడలో శుక్రవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు మర్యాదపూర్వక కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ పార్టీ పరిస్థితి వివరించారు లోకేష్‌కు వివరించారు. నియోజకవర్గ పరిశీలకులుగా వచ్చినవారు పార్టీ పరిస్థితి చక్కబెట్టడం లేదన్నారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ వారం రోజుల్లో కలిసి మాట్లాడుదామని హామీ ఇచ్చారు. లోకేష్‌ను కలిసిన వారిలో అప్పలనాయుడుతో పాటు మంగళాపురం ఎంపిటిసి ప్రతినిధి మజ్జి నవీన్ ఉన్నారు.

పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్నఎస్ఐ నీలకంఠరావు

బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి -కురుపాం

మండలంలోని లంకజోడు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను నీలకంఠాపురం ఎస్ఐ ఎ.నీలకంఠరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసా ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలను సందర్శించి మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులు వారి విద్యాభివృద్ధి మెరుగుపరుచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి -కురుపాం

మండలంలోని వలసగూడలో శుక్రవారం రాత్రి నీలకంఠాపురం ఎస్సై ఎ.నీలకంఠరావు కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించగా అక్కడ పేకాట ఆడుతుండగా నలుగురు వ్యక్తుల నుంచి రూ. 1700 స్వాధీన పరుచుకున్నారు. అనంతరం గ్రామస్తులకు మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిస కావడం వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సక్రమమార్గంలో నడిచి వ్యసనాలకు బానిస కాకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తవలసలో కార్డాన్ చర్చ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధిలో గల కొత్తవలసలో ధోనుబాయి ఎస్సై షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో కార్డాన్ చర్చ్ నిర్వహించారు. గ్రామంలో చుట్టూ క్షుణంగా ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. నాటు తుపాకీలుంటే స్టేషన్‌కు అందించాలన్నారు. లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటు తుపాకీలు ఉపయోగించకూడదని చెప్పారు. ప్రజలకు దీనిపై అవగాహన కల్పించారు. దానిలో భాగంగా సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. నాటు సారా నిర్మూలనకు మీరంతా సహకరించాలని కోరారు. ఆయనతో పాటు ఎఎస్ఐ త్రినాధరావు, తదితరులు ఉన్నారు.

కొత్తవలస గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షేక్ మస్తాన్

ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, ఆటోడ్రైవర్లు

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ కన్వీనర్ బి.సూరిబాబు డిమాండ్ చేశారు. పట్టణం లోని వివిధ ఆటో స్టాండ్‌ల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11న సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక పాత బస్టాండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించే ఆటో కార్మికుల ర్యాలీలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఓట్ల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఈ పథకం ప్రవేశ పెట్టినప్పుడు ప్రత్యామ్నాయంగా నష్టపోతున్న ఆటో కార్మికులను ఆదుకునేందుకు కూడా కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిరుద్యోగం పెరిగి అంతంతమాత్రంగా ఉన్న ఉపాధి ఉచిత బస్సు పథకం వల్ల పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉచిత బస్సు పథకానికి ఆటో కార్మికులు వ్యతిరేకం కాదని, కానీ నష్టపోతున్న ఆటో కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని, ఆర్థిక సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులకు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లీగల్ ఎఎస్ఐ శ్రీరాములు

వ్యసనాలు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని లీగల్ ఎఎస్ఐ శ్రీరాములు అన్నారు. మండలంలోని జోగింపేట అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. అలాగే పదిమందికి ఉపయోగపడేలా సూచనలు, సలహాలు అందించాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్, నల్లమందు వంటి పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల పట్ల స్నేహభావంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.రాజారావు, హెడ్ కానిస్టేబుల్ సీతయ్య, కానిస్టేబుల్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

కాంగ్రెస్ వైపు ప్రజల చూపు : బత్తిన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

దేశం యావత్తు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఆశిస్తుందని, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పగ్గాలు చేపట్టటం ఖాయమనిపార్వతీపురం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జ్ బత్తిన మోహన్‌రావు అన్నారు. పార్వతీపురం పట్టణానికి చెందిన విశ్రాంత టీచర్ గొట్టాపు తిరుపతిరావు మాస్టారు శుక్రవారంకాంగ్రెస్‌లో చేరారు. బత్తిన మోహన్‌రావు తిరుపతిరావు మాస్టారుకు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిరావు మాస్టారు పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. చదువుకున్న వారు, మేధావులు, క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై కాంగ్రెస్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటానికి నిత్యం సహాయ సహకారాలు అందించాలన్నారు. పార్వతీపురంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కాంగ్రెస్ పోరాడి ఫలితాలను సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఒబిసి జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీశంకరరావు, జిల్లా నాయకులు కోల కిరణ్, చొక్కాపు వెంకటరమణ, బొంత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొనితిరుపతిరావు మాస్టారును పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో తిరుపతిరావు మాట్లాడుతూ తాను చిన్నప్పటి నుంచి కాంగ్రెస్ట్ అభిమానిని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానన్నారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన 'ఓప్రేమ చిత్రం' యూనిట్ సభ్యులు

'ఓ ప్రేమ చిత్రం' విజయం సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్క్రీన్ ప్లే పిక్చర్స్ పతాకంపై ప్రవీణ్ కెవి నిర్మాణంలో చిరంజీవి కృష్ణపల్లి దర్శకత్వంలో మొదటి చిత్రంగా రూపుదిద్దుకుంటున్న ఓ ప్రేమ చిత్రం మంచి విజయం సాధించాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ మేరకు పార్వతీపురానికి చెందిన చిత్ర బృందం అమరావతిలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ చిత్రానికి సంబంధించి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇవ్వడంతో యూనిట్ బృందం ఆనందం వ్యక్తం చేసింది. పార్వతీపురం పట్టణానికి చేరుకున్న చిత్ర దర్శకులు చిరంజీవి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మంచి ప్రేమ కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఇటీవల కులుమనాలి, అరకు ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్నట్టు తెలిపారు. మరి కొన్ని రోజులు పార్వతీపురం మన్యం జిల్లా పరిసర ప్రాంతాల్లో చిత్రానికి సంబంధించిన మిగిలిన షెడ్యూల్ పూర్తి చేసి త్వరలోనే తెరకెక్కించబోతున్నామని అన్నారు. ఈ అవకాశం ఇచ్చిన మంత్రికి ఓ ప్రేమ మూవీ టీమ్ కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో హీరో సాయి తేజవర్మ, హీరోయిన్ మధుస్మిత, నటులు శాంతారామ్, ప్రసాద్ ఉద్దవోలు, జీ.బాలభాస్కర్, సాయి లంక, అసిస్టెంట్ డైరెక్టర్ పృథ్వీరాజ్, మేనేజర్ సంపత్ కుమార్. పాల్గొన్నారని తెలిపారు.

104 వాహన పైలట్లకు శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

104 వాహనాల జిల్లా మేనేజర్ కృష్ణ, జిల్లా ఫ్లీట్ మేనేజర్ పైడిరాజు శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ భవనంలో 104 పైలట్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలను ప్రతిరోజూ పరిశీలించి, ఏదైనా మరమ్మతులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాహనాల వల్ల ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అన్ని గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని అన్నారు. అన్ని వాహనాల్లో మందులు అందుబాటులో ఉన్నాయని, మరికొన్ని రోజుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడం కోసం అన్ని రకాల పరీక్షలు చేయడానికి ల్యాబ్ టెక్నీషియన్లు కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్‌లు మురళి, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ కృష్ణ

అకస్మాత్తుగా కురిసిన వర్షం

పలు వీధులు జలమయం

పార్వతీపురం టౌన్ : పట్టణంలో శుక్రవారం రాత్రి 8 గంటలకు అకస్మాత్తుగా కురిసింది. ఈ వర్షానికి పట్టణంలోని పలు వీధులతో పాటు, ప్రధాన రహదారి జలమయమైంది. మున్సిపాల్టీలో గల కాలువలతో పాటు, ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడికలు పేరుకుపోవడం, వరహాల గెడ్డలో పూడికలను తొలగించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.30 లక్షలతో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాకపోయినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడం ఒక ఎత్తు అయితే, పాలకవర్గ సభ్యులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం మరో ఎత్తు. ఇప్పటికైనా తక్షణమే మున్సిపల్ అధికారులతో పాటు పాలకవర్గ సభ్యులుప్రత్యేక చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మూడు నెలలకే మరమ్మతులా?

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండవ గ్రామ జంక్షన్ నుండి నవగాం జంక్షన్ వరకు చేపట్టిన బిటి రహదారి పనులు మూడు నెలలకే మరమ్మతులకు గురైంది. వండవ గ్రామ జంక్షన్ నుండి నవగాం గ్రామ జంక్షన్ వరకు ప్రధాన రహదారి పూర్తిగా మరమ్మతులకు గురి కావడంతో ఈ ఏడాది మే 8న రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. పనులు చేపట్టినప్పుడు అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో రహదారి నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు కొరవడంతో అతి తక్కువ కాలంలోనే మళ్లీ రోడ్డు మరమ్మతులు చేపట్టారంటే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో వీటిని చూస్తే అర్థం చేసుకోవచ్చు. ప్రజాధనాన్ని కాపాడాల్సిన అధికారిలే ప్రభుత్వ ఆదేశాలకు తూట్లు పొడుస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాడైన రోడ్డుపై చేపట్టిన ప్యాచ్ వర్క్

తెలుపు రంగు నాగుపాము హల్‌చల్

ప్రజాశక్తి - భామిని

స్థానిక ఎస్సీ వీధిలోని ఒక ఇంటి వద్ద తెలుపు రంగులో నాగుపాము తిరుగుతూ శుక్రవారం కనిపించింది. ఈ పాము తెలుపు రంగులు ఉండడంతో దాన్ని చూడడానికి స్థానికులు ఎగబడ్డారు. సాధారణంగా నాగు పాములు తెలుపురంగులో ఉండవు, కానీ నాగు పాములో కూడా మానవుడికి లాగే రంగుకు కారణమైన మెలనిన్ ఉంటుంది, ఇది లోపిస్తే అది తెలుపు రంగులో కనిపించడానికి అవకాశం ఉందని భామిని వెటర్నరీ డాక్టర్ మడక సంతోష్ కుమార్ తెలిపారు.

భామినిలో కంటపడిన తెలుపు రంగు నాగుపాము